క్లుప్తంగా

కుర్చీలు, డస్ట్‌బిన్‌లు వితరణ



వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఆర్టీసీ డిపోకు కుర్చీలు, డస్ట్‌బిన్‌ను శుక్రవారం బహూకరించారు. పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ బి.కోటేశ్వర నాయక్‌కు అందించారు. కొచ్చర్ల పూజా ట్రేడర్స్ కారంసెట్టి వెంకటేశ్వర్లు ధర్మపత్ని నాగరత్నమ్మ జ్ఞాపకార్థం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు దుబ్బల నాగరాజుకుమార్, అసోసియేషన్ సహాయ కార్యదర్శి సూరా రామిరెడ్డి, కార్యదర్శి ఇనగంటి ఆంజనేయులు, ముఖ్య సలహాదారు ముజీర్ అంకిరెడ్డి, జానీబాషా, బుజ్జినాయక్, అనంతరామయ్య, నాగేశ్వరరావు, రాజానాయక్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం భవన ప్రాంగణంలో సంఘ సభ్యులు 200 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 2014 నుంచి సేవా సంఘం ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల మరణించిన గంగినేని వీరయ్య మాస్టార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు జి.నాగేంద్రుడు, ఎ.రామలింగేశ్వరరావు, నారాయణ, దీక్షితులు, జోజయ్య, రాఘవయ్య, ఎ.వెంకటేశ్వరరావు, ఎం.వి.శర్మ పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి



బొల్లాపల్లి: మండలంలోని కనుమలచెరువు రెవెన్యూ పరిధిలో డ్రోన్ సహాయంతో శుక్రవారం రీసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ జి.శివశ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో రీసర్వే నిర్వహించి ప్రతిరైతుకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా న్యాయం చేస్తామన్నారు. డ్రోన్ సహాయంతో సర్వే అనంతరం హద్దులు నిర్వహించి రైతులకు పట్టాలు అందజేస్తామని తెలిపారు. రైతులు రీసర్వేకు సహకరించాలని కోరారు. గ్రామంలో రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీనునాయక్, హనుమానాయక్, ఎంపీటీసీ వస్తంనాయక్ పాల్గొన్నారు.

కల్పతరువులో నేత్ర వైద్య శిబిరం



నాదెండ్ల: కల్పతరువు స్పిన్నింగ్ మిల్లులో శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గుంటూరు సుదర్శిని నేత్ర వైద్యశాల వైద్యులు గణేశుని రాజేశ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు. 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన 45 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. మిల్లు ఎండీ లంకా రఘురామిరెడ్డి మాట్లాడుతూ, కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు మిల్లు తరపున అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం అధ్యక్ష, కార్యదర్శులు పోలిశెట్టి రాఘవయ్య, దాసునాయన, సభ్యులు లంకా ఆదినారాయణరెడ్డి, భాస్కరరెడ్డి, అలంగార్ మోహన్, జంపని శ్రీనివాసరావు, దినేష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

దేచవరం ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



నకరికల్లు: దేచవరంలోని ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల శుక్రవారం జరిగింది. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు ఎల్.వెంకటకృష్ణమాచార్యులు, రాధాకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించారు. భక్తులతో ఆలయప్రాంగణం కిక్కిరిసింది. వైఎస్సార్‌సీపి మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, పలువురు నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు పులిహోర, మజ్జిగ, మినరల్‌వాటర్ ఉచితంగా పంపిణీ చేశారు. భక్త సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

ఉరుకులు.. పరుగులు



రొంపిచర్లలో కల్లాల్లో ఉన్న మిర్చి పంటపై పట్ట కప్పుతున్న రైతులు



నాదెండ్ల మిర్చి పంట..

నాదెండ్ల: అల్పపీడనంతో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షం రైతులను ఉరుకులు పరుగులు పెట్టించింది. పొలాల్లో కోతకొచ్చిన పొగాకు, ఆరబెట్టిన పొగాకు, కల్లాల్లో ఆరబోసిన మిర్చి, చేలల్లో కోయాల్సిన మిర్చి పంటలు ఉన్నాయి. అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందారు. శనగ పంట ఇప్పటికే 50శాతం నూర్పిడి పూర్తయి పంట ఇంటికి రాగా, మరో 50 శాతం పొలాల్లోనే ఉంది. మొక్కజొన్న కూడా కోత దశలో ఉంది. అకాల వర్షంతో పంటలకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో ఆరబోసిన మిర్చిని పట్టలతో కప్పి కాపాడుకునేందుకు పరుగులు తీశారు. తెల్లవారుజామున 3గంటల నుంచి 6.30 గంటల వరకు వర్షం భారీగా కురిసింది. 10గంటల తర్వాత పట్టలు తీసి మిర్చిని ఆరబెట్టుకున్నారు. మరో రెండు రో జుల పాటూ వర్షాలు కరుస్తాయన్న వాతావరణ హె చ్చరికలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

రొంపిచర్ల: అకాల వర్షంతో రైతులు అవస్థలు పడ్డారు. తెల్లవారుజామున భారీ వర్షంతో మిర్చి, మొక్కజొన్న రైతులు ఆందోళన చెందారు. ఆరబెట్టిన పంటపై టార్పాలిన్ పట్టలు కప్పి రక్షించుకునేందుకు రైతలు అవస్థలు పడ్డారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దు

న్యాయమూర్తి తౌషిద్ హుసేన్



కళాశాల విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి తౌషిద్ హుస్సేన్

వినుకొండ టౌన్: పరీక్షల కాలంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దని జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్ హుసేన్ సూచించారు. ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా పట్టణంలోని శ్రీమతి గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి తౌషిద్ హుసేన్ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉన్నత విద్యలో రాణించి ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా కోర్టు కార్యక్రమాలు, కేసుల విచారణ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పీవీ రమణారెడ్డి, కె. చెన్నకేశవరెడ్డి, పి.గౌస్ మొహిద్దీన్ ఖాన్, జె.తిరుపతిరావు, జి.నాగరాజు, ఐ.నాగపద్మ, సిహెచ్.బ్రహ్మం పాల్గొన్నారు.

గ్రామసచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

శావల్యాపురం: గ్రామసచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి లోతేటి వరలక్ష్మి అన్నారు. మండలంలోని కనమర్లపూడిలో శుక్రవారం పర్యటించారు. ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచి తన్నీరు భారతి, ఎంపీడీఓ పి.సీతారామయ్య, ఎంఈఓ ఎం.సాంబశివరావు, వైద్యాధికారి వి.వెంకట భాస్కర్, సూపర్‌వైజరు సాయిగీతా, ఏఈ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కుప్పం శ్రీలత, గుర్రం శేషకుమారి, పంచాయతీ కార్యదర్శి డి.రవీంద్ర, వీఆర్వో ఉప్పుటూరి చిన మంగయ్య పాల్గొన్నారు.

బాలుర వసతి గృహంలో రాత్రి బస

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని నూజెండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని బాలుర వసతి గృహంలో మండల స్పెషలాఫీసర్ రవిబాబు గురువారం రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్‌లోని భోజనం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే శుక్రవారం ఉదయం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి ఈపెన గండ్ల అంజమ్మ, తహసీల్దార్ మధుబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గంగాభవాని పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు



బొల్లాపల్లి ఎస్సీకాలనీ వాసులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ఓబులనాయుడు

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలను ప్రత్యేకాధికారి ఎస్.ఓబులనాయుడు శుక్రవారం పర్యటించారు. గ్రామంలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతతో పాటు మహిళలు, బాలికల్లో ప్రధానంగా రక్తహీనత, పోషకాహారం లోపం వంటి పలు అంశాలను పరిశీలించారు. సైడ్ డ్రెయిన్స్‌ను పరిశీలించి పూడికతీత పనులు చేపట్టాలని, పరిసరాలను పరిశుభ్రతగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ బొల్లాపల్లి గ్రామాన్ని మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి కేజీబీవీని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి భోజనం అనంతరం రాత్రి నిద్ర కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ, ఎంపీడీఓ టి.పార్వతి పాల్గొన్నారు.

గొరిజవోలులో గ్రామోదయం

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు గ్రామాన్ని మండల ప్రత్యేకాధికారి బీజే బెన్నితో పాటూ మండల స్థాయి అధికారులు శుక్రవారం సందర్శించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో పైపులైన్లు ద్వారా పంచాయతీ నీరు అందటం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై పైపులైను ఏర్పాటు కోసం రూ.2 లక్షల ఖర్చు అవుతుందని ఏఈ సూర్యతేజ తెలపగా, నెలరోజుల్లో పైపులైను ఏర్పాటు చేసి వారికి నీరందేలా చూడాలని ప్రత్యేకాధికారి బెన్నీ ఆదేశించారు. ఫిల్టర్ బావులు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి మంచి పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచి గొర్రెపాటి గృహలక్ష్మి, ఎంపీడీఓ జాకీర్‌హుసేన్, ఎంఈఓ ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, హౌసింగ్ ఏఈ రామకృష్ణనాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు గోల్డ్ వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి షేక్ అహమ్మద్ పాల్గొన్నారు.

31 బార్ అసోసియేషన్ ఎన్నికలు

వినుకొండ టౌన్: స్థానిక బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 24న నిర్వహించనున్నట్లు వినుకొండ బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారి యనమదల శ్రీనివాసరావు తెలిపారు. కోర్టు భవనంలో ఏర్పా టు చేసిన సమావేశంలో ఎన్నికల వివరాలను శుక్రవారం వెల్లడించారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు ఈ నెల 20వ తేదీ అని, 21న పరిశీలన, 24న విత్ డ్రా తేదీలుగా పేర్కొన్నారు. కాగా ఈ నెల 31న ఎన్నిక, కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించను న్నట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అదనపు ఎన్నికల అధికారులుగా గాలి నాగరాజు, దూల నాగరాజు వ్యవహరించనున్నట్లు వివరించారు.

22న తిరునాళ్లకు పోలీస్ బందోబస్తు

శావల్యాపురం: ఈనెల 22న ఉగాది సందర్భంగా మండలంలోని బొందిలిపాలెంలోని అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి ఆలయ తిరునాళ్లకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ గల్లా రవికృష్ణ తెలిపారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించారు. ట్రాఫిక్‌పై చర్చించారు. శావల్యాపురం -2, బొందిలిపాలెం-2, మతుకుమల్లి-03, శానంపూడి- 2 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నారని, అడవిపాలెం, మతుకుమల్లి వారిచే రెండు కోలాటం కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచి బోడాల వీరాంజనేయులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పార్టీలకు అతీతంగా పోలీసులకు సహకరించాలని ఎస్ఐ రవికృష్ణ కోరారు.

అసంఘటిత కార్మికులకు అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న మాధవరావు

యడ్లపాడు: అసంఘటిత కార్మికుల సంరక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఇండియా లేబర్ లైన్ కోఆర్డినేటర్ మాధవరావు చెప్పారు. మండలంలోని బోయపాలెం రంగనాయక స్పిన్నింగ్ మిల్ క్వారీ క్యాంప్ ప్రాంగణంలో అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్, వర్కింగ్ పీపుల్స్ కోయాలిషన్, ఇండియా లేబర్ లైన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో పలువురు కార్మికుల సమస్యలపై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివిధ రంగాల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన కార్మికులందరికీ వచ్చేలా కృషి చేస్తామని ఇండియా లేబర్ లైన్ కోఆర్డినేటర్ మాధవరావు చెప్పారు. వంకాయలపాడు పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు క్వారీ వర్కర్స్ క్యాంపులో నివసించే 15కుటుంబాలకు ఆధార్‌కార్డులు వచ్చేలా చేస్తానంటూ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిలకలూరిపేట లేబర్ కార్యాలయ సిబ్బంది రామారావు, ఇండియా లేబర్ లైన్ విజయవాడ, గుంటూరు ప్రతినిధులు ఈశ్వర్, మిక్కిలి సురేష్ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక లోక్‌అదాలత్

నరసరావుపేట టౌన్: జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఓ. వెంకట నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. అదాలత్‌లో కుటుంబ సంబంధమైన వివాదాలు, సివిల్, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నరసరావుపేట: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఐటీయు, మున్సిపల్ వర్కర్స్ మరియు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ నెలకు రూ.26వేలు ఇవ్వాలని, ప్రతి కార్మికునికి ఇంటి స్థలం కేటాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించి, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. మున్సిపాలిటీల్లో వాహన డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్ మసూద్, సీఐటీయూ జిల్లా కోశాధికారి డి.శివకుమారి, నాయకులు ఏ సాల్మన్, టీ మల్లయ్య పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ తనిఖీ

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు గురువారం రాత్రి సందర్శించారు. హాస్టల్ విద్యార్థులతోకలసి భోజనం చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధనా, కనీస సౌకర్యాలు కూడా వాకబ్ చేశారు. రాత్రి పాఠశాలలోనే బస చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కేపీ బాబురెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికుడిపై దాడి

నరసరావుపేట రూరల్: ఆటోలో ప్రయాణికుడిపై దాడి చేసి నగదు దోచుకెళ్లిన ఘటన మండలంలోని పమిడిపాడు సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. ముప్పాళ్ల మండల కేంద్రానికి చెందిన షేక్ మాబు సుభాని నరసరావుపేటలో అరటికాయల వ్యాపారం చేస్తుంటాడు. గురువారం రాత్రి 10.30గంటల సమయంలో పని ముగించుకుని ఇంటికి వచ్చే క్రమంలో కోటసెంటర్‌లో ఆటోల కోసం సుభాని వేచి ఉన్నాడు. ఆ సమయంలో ఆటోలో వచ్చిన ముగ్గురు యువకులు ముప్పాళ్లకు వెళ్తుందని నమ్మబలికారు. ములకలూరు దాటిన తరువాత ఆటోను పమిడిపాడు వైపు మళ్లించారు. కొంత దూరం వెళ్లాక ఆటో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు కలిసి ఒక్కసారిగా సుభానిపై దాడికి దిగారు. కేకలు వేస్తే చంపుతామంటూ బెదిరించి అతడి వద్ద ఉన్న రూ.2వేలు నగదు తీసుకెళ్లారు. అనంతరం బాధితుడిని ములకలూరులో వదిలివెళ్లారు. తలపై, ముఖంపై తీవ్రగాయాలైన సుభాని స్థానికుల సహాయంతో తన బంధువులకు సమాచారం అందించాడు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 8 మందికి గాయాలు

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ శివారు బాలాజీ ఎస్టేట్ వద్ద గురువారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కాకినాడ నుంచి మంత్రాలయం వెళ్తున్న ఆర్టీసీ బస్సు గుంటూరు నుంచి శనగల లోడుతో వినుకొండ వైపు వస్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ పిల్లి నాగేశ్వరరావుతో సహా 8 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ హామీలు నెరవేర్చాలి

ఏపీ అమరావతి జేఏసీ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు

నరసరావుపేట: వచ్చే నెల ఐదో తేదీ లోగా తమకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం సాయంత్రం పల్నాడు జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నాళ్లుగానో ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకోసం ఈనెల 9వ తేదీ నుంచి నిరసన కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఉద్యమానికి ఏపీ జేఏసీతోపాటు మిగతా ఉద్యోగ సంఘ నాయకులు కలసి రావాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వో కె.వినాయకంను కలసి చర్చలు నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను తీర్చిదిద్దాలి

డీఈఓ శామ్యూల్

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చైతన్యపరచాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ తెలిపారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈఎండీపీ) కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 111 ప్రభుత్వ పాఠశాలల నుంచి 403 ప్రాజెక్టులను విద్యార్థులు రూపకల్పన చేయగా, జిల్లాస్థాయికి ఎంపికైన పది ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో రెండు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించటంతోపాటు నూతన నైపుణ్యాలు, సృజనాత్మకతను అలవరుచుకునేలా వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠ్యాంశాలతో పాటు ఆర్థిక అవగాహన, బడ్జెట్, పారిశ్రామిక అభివృద్ధి, శాస్త్ర పురోగతి, సాంకేతిక మార్పులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల(అమరావతి), ఏపీ మోడల్ స్కూల్ (బొల్లాపల్లి) విద్యార్థులను అభినందించారు. కార్యక్రమాన్ని జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏఏ మధుకుమార్ పర్యవేక్షించగా, ఎస్‌సీఈఆర్‌టీ ప్రోగ్రాం జిల్లా మేనేజర్ ఆరాధ్యశర్మ, సీనియర్ ఉపాధ్యాయులు ఓ సాంబయ్య, చిట్టెమ్మ, జి.నాగేశ్వరరావు, ఓ కోటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.రవికాంత్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూములకు మేలు



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, విద్యార్థులు

చిలకలూరిపేట: ప్రకృతి వ్యవసాయంతో భూములు సారవంతమవుతాయని వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ మనోజ్‌కుమార్ చెప్పారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ర్యాలీలో పసుమర్రు మద్ది కామయ్య జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాలం ముగిశాక ఖాళీగా ఉన్న పొలాల్లో విత్తన గుళికలు వేసుకోవడం వలన భూమి సారవంతమై జీవ వైవిధ్యం పెరుగుతుందని తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న విత్తనాలకు ఘన జీవామృతం, బంకమన్ను, బూడిద మిశ్రమంతో విత్తన గుళికలు చేసుకోవాలన్నారు. ఇలా చేసిన విత్తన గుళికలను ఎకరాకు 13 కిలోల చొప్పున వారికున్న పంట పొలాల్లో వేసుకుంటే పంటకు కావాల్సిన పోషకాలన్నీ సంవృద్ధిగా అంది పంటలు బాగా పండుతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది తిరుమలరావు, నాగార్జున, ఉమాదేవి, రామకోటేశ్వరరావు, మధువాణి, స్కూల్ హెచ్‌ఎం షేక్ మొహమ్మద్ యాసిన్ పాల్గొన్నారు.

పశుపోషణతో ఆర్థిక స్వావలంబన

బొల్లాపల్లి: పశుపోషణ ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సీహెచ్.నరసింహులు తెలిపారు. మండలంలోని గుమ్మనంపాడు గ్రామ రైతు భరోసా కేంద్రంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా వ్యవసాయంతో పాటు రైతులకు పాడి పశువుల పెంపకంతో ఆర్థిక తోడ్పాటు ఉంటుందన్నారు. పశు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల గురించి రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పశువులకు ఏమైనా వ్యాధులు సంభవించినప్పుడు స్థానికంగా పశువైద్యాధికారులను సంప్రదించి చికిత్సను పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఎస్.వెంకాయమ్మ, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీనివాసమూర్తి, పశువైద్యాధికారి బి.సాల్మన్‌సింగ్ పాల్గొన్నారు.

సాహితీవేత్త బుజ్జిబాబుకు సన్మానం



దార్ల బుజ్జిబాబును సన్మానిస్తున్న దృశ్యం

చిలకలూరిపేట టౌన్: బాలల సాహిత్యంలో తనదైన ముద్ర వేసుకున్న బాలల రచయిత దార్ల బుజ్జిబాబు అని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల చెన్నైలోని తెలుగు-వెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా దార్ల బుజ్జిబాబుకు జాతీయ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జనవిజ్ఞానవేదిక, యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్, లయన్స్ క్లబ్, కళాతోరణం ఆధ్వర్యంలో బుజ్జిబాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా బాలసాహిత్యంలో విశేష ప్రతిభ కనపరిచారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక తెలుగు భాష విశిష్ట పురస్కారాన్ని 2018లో అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏవీ శివయ్య, చుక్కా విన్సెంట్‌పాల్, మేకపోతుల వెంకటేశ్వర్లు, పట్టాబి రామారావు, కోటేశ్వరరావు, పోలిశెట్టి నాగేశ్వరరావు, యక్కల రాజేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడిపై దాడి

నాదెండ్ల: సాతులూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గద్దె కోటేశ్వరరావుపై మద్యం తాగిన ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. ఎస్ఐ ఆవుల భాస్కర్ తెలిపిన వివరాలు.. యలినీడి వెంకటరావు(బొల్లారావు) నిత్యం మద్యం తాగుతుంటాడు. గతంలో రెండుసార్లు మద్యం మత్తులో అసభ్యంగా మాట్లాడుతుండగా గద్దె కోటేశ్వరరావు, గ్రామస్తులు హెచ్చరించారు. ఇది మనసులో పెట్టుకున్న వెంకటరావు శుక్రవారం ఉదయం చందవరం సెంటర్‌కు వెళ్ళి ద్విచక్రవాహనంపై వస్తున్న గద్దె కోటేశ్వరరావుపై దారిలో కాపుకాసి కత్తితో దాడి చేశాడు. దీంతో కోటేశ్వరరావు తలకు గాయమైంది. స్థానికులు గమనించి చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీసీల అభివృద్ధికి సాహు మహరాజు సేవలు చిరస్మరణీయం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు

వినుకొండ(నూజెండ్ల): భారతదేశంలో వెనుకబడిన కులాలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత ఛత్రపతి సాహు మహరాజుకు దక్కుతోందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు పేర్కొన్నారు. పట్టణంలోని పల్నాడు రోడ్డులోని పద్మప్రియ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య పరంగా వెనుకబడి కులాలకు వసతి గృహాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆయన సంస్కరణలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభావితులైనట్లు వివరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువనాయకులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, నియోజకవర్గం బీసీ సంఘం అధ్యక్షుడు పాశం నాగమల్లేశ్వరరావు, న్యాయవాదులు సైదారావు, సిద్దయ్య పాల్గొన్నారు.

గోగులపాడులో అధికారుల పర్యటన

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడులో ఎంపీడీఓ కె.మాధ్యూబాబు, తహసీల్దార్ అంకారావు శుక్రవారం పర్యటించారు. గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ముండ్రు హరినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శశిదేవి పాల్గొన్నారు.